# రంగవల్లి

అది,– 'మనుచరిత్రం బందుకొనువేళ'– కొత్త బరువుగా, పెండేరం ఒరుసుకుంటూన్నది– పెద్దన్నగారు, ఆపాదం గనంత ముందుకుమోపి,– రాజును మించిన ఠీవితో గొంతు సారించాడు : రాయలవారు, పరధ్యానంగా, వింటూన్నట్టు చిరునవ్వుతో, యోధుడల్లే కూర్చున్నాడు :–

మనుచరిత్ర రచన పూర్తిఅయేసరికి అందులో రవ్వల్లాంటి పద్యాలన్నీ, విద్యానగరంలో ప్రతిఇంటింటికీ, చూరు చూరుకూ, పెండె పెండెకూ పట్టిపోయినాయి. ఆ సంగతి యిచ్చిపుచ్చుకునేవారికీ, తతిమ్మా పెద్దలందరికీకూడా తెలుసు. కాని, యీ తతంగం ఉంటూ తలపెట్టి, ముహూర్తం పెట్టినప్పుడు – అదో ఉత్సవమంత హంగామాగా చేస్తున్నప్పుడు

మళ్ళీ ఒక్కసారి, అక్కడా-అక్కడా నాలుగు పద్యాలు ఏరి, వినిపించడం- అదో లాంఛనం: ఆ మొక్కు తీరిపోగానే, ఆశ్వాసాలకు ముందూ వెనుకా పద్యాలు చదవడం రివాజు: ఆ పద్యాల పసలో ఉంది,- కృతి పుచ్చుకునేవాడు, ఎంత వరకూ మోజుపడతాడో,- ఎంతకు తూగుతాడా అనేది !-

ఒకటి తరువాత మరోపద్యం, వెనుకటిదాసి తాత లాగా, సభలో మురుస్తూంది: రాయలవారు, ఇంద్రుడైనాడు, చంద్రుడైనాడు,- వాళ్లను పుట్టించిన వాడైనాడు- చతుర్దశ భువనాల్లో ఉన్న తురుష్కుల నందరినీ, ఒంటిచేతిమీద చీల్చి చెండాడాడు: అంతటితో శాంతించక బంగారం తాంబూలంలో పచ్చని అగ్రహారం పెట్టి, పెద్ద బ్రాహ్మడి నోటి మీదుగా ప్రబంధం అంకించుకుంటున్నాడు-

వందిమాగధులకు అది ఆట విడుపు. సభాస్తారులు మాత్రం తప్పనిసరిగా పద్యాలకు రాజోచిత మర్యాదగా, తల పంకించుతూ, కొలువు చేస్తున్నారు-

"చిన్నాదేవీ జీవితనాయక !-"

ముసలి సత్తువకొద్దీ, ఉన్నట్టుండి, కందపద్యం తునక బాకల్లే విసిరాడు: గురి బెడిసిపోకుండా రాయలవారి గుండెల్లో నాటింది - సభలోంచి దూసుకున్నారు -

'కవితా ప్రావీణ్య పణేశ, కృష్ణరాయ మహేశా!-'

రాజువెంట సభఅంతా తరలింది: నడుస్తూనే పెద్దన్న గారు పద్యం పూర్తిచేశారు: అప్పటికప్పుడే, కృష్ణరాయ మహేశుడు, అరదంమీదికి దుమికి, మనోవేగం అయినాడు -

వాకిటి కావలి తిమ్మన్న ఒక్కడూ, జాలిగా ఆ వంకే చూస్తూ నిలుచున్నాడు: పెద్దన్నగారి అడుగు అక్కడ ఆగింది:

'ఏం తాతా?' అని గొణుక్కున్నాడు తిమ్మన్న:

'ఏం అన్నా!' అని గదమాయించింది — గండ పెండేరం.

'కృష్ణుడిమీద యిప్పటికైనా కరుణ కలిగిందేమో అనుకున్నాను!' అని నిట్టూర్చాడు తిమ్మన్న:

'తమ్ముడూ! - కవికీ కత్తికీ కరుణ ఏమిటి? - ఒక్కటె వాడి!-' అని పిడుగల్లే అన్నాడు పెద్దన్నగారు: గజపతుల ఆడుపడుచు అలా అయిపోవడానికి, కారణం ఏ రాజపరమేశ్వరుల ప్రతాపం? - కన్నతల్లి మోహనాంగిని కత్తివాతచేసిన,- కన్నడ రాజ్యరమా రమణుడు - ఎలా మరచిపోతాను, - ఎందుకు కరుణిస్తాను తిమ్మన్నా! - అంకితం పద్యాలకు అహో రాత్రాలు పదునుపెట్టాను - ఆకల్పాంతం ఈతడి యశః కాయాన్ని చీల్చి చెండాడుతూండవద్దూ: మోహనాంగి, నా శిష్యురాలు తిమ్మన్నా! - ఆ తల్లి ఆత్మశాంతికి, - ఇంత కాలం బ్రతికాను -' పెద్దన్నగారు శోకంతో, నేల దద్దరిల్లె అడుగులు వేస్తూ వెళ్లిపోయినారు -

తిమ్మన్న అలాగే ద్వారానికి ఆనుకుని చతికిల పడిపోయి, - కళ్ళనీళ్ళతో, ఆనాటి కథంతా తలపోసు కున్నాడు - కన్నదీ, విన్నదీ!.........

## ౨

రాయలవారు కటకందాకా దిగ్విజయం చేసి, మగుడి నగరుకు వేంచేస్తున్నారని – రాజధానిలో చాటించారు: నగరానికి నలుమూలలా ఉన్న పూలన్నీ దులుపుకువచ్చి, పౌరులు మహారాజుమీద పుష్పవర్షం కురిపించేందుకు కావలసిన కట్టుబాట్లన్నీ మహామంత్రి చేశాడు: అందరికీ కనువిందుగా కన్నడ – రాజ్యరమా రమణుడు రాజమార్గమంతటా తీవి మెరయించి – అలసటగా అంతఃపురం ప్రవేశించాడు:

మహారాణి తిరుమలాంబికా, అమ్మాయి మోహనాంగి, ఎదురుగా వచ్చారు: అన్ని ఏళ్లనుంచి కాపురం జేస్తున్నా రాణి అప్పటికప్పుడు, అన్నాళ్ళకు కనబడ్డ నాథుణ్ణి ఓరగా చూస్తూ కొత్తపెళ్ళి కూతురంత సిగ్గుపడ్డది: మహారాజు, ఒక్క కటాక్ష వీక్షణం అలవోకగా ప్రసరించారు:

'విజయలక్ష్మి సమేతులు – మహారాజులు–' అని ప్రణామంచేసింది– మోహనాంగి: రాయలవారు రవంత ఉలికిపడి, తిమ్మరుసు అయ్యవారి వంకచూశారు:

'ప్రభువు మార్గాయాసం అపనయించుకోవలసి ఉంది–' అని మనవి చేసినట్టుగా పలికి,– ఇద్దరూ బయటికి తప్పుకున్నారు:

'అమ్మాయి శ్లేషించిందేమోనని, అనుమానం అప్పాజీ!' అన్నారు రాయలవారు: తిమ్మరుసు వెంట అడుగు వేస్తూ: 'అనుమానం కాదు. అదిరూఢే ప్రభూ!'

'అతిరహస్యంగా కొనసాగించామే!- మనం గజపతుల కన్యను చెట్టబట్టినట్టు- అప్పుడే ఇక్కడికి ఎలా తెలిసిందీ?'

'రవి కంటబడనివి,- కవికి ఎలా తెలుస్తాయో అలాగే!- మీబిడ్డ ఆమాత్రం గ్రహించ లేదా?-

'విజయలక్ష్మి అని పేరుకూడా ఎలా తెలిసింది?- అంతఃపురం మనమీద వేగు నడుపుతూందా?-'

'అది అసంభవం నాయనా ! కాని, నీ దిగ్విజయ-వార్త మరుక్షణంలో దిగ్దిగంతాలూ వ్యాపించడం పరిపాటి అయిపోయింది: ఇదీ అంతే!-'

'అంతేనని శోచదు అప్పాజీ !- నాకు అవగతం కాని హాంశం ఏదో ఉంది: తనతల్లికి సవతిని తెచ్చానని,- మా తల్లికి ఆగ్రహం వచ్చిందేమో ?'

'రాదు - ప్రభువు శోభన పరంపరా వ్యాప్తికి మురియని ప్రజలు- విద్యానగరంలో లేరని- నేను మనవి చేయవలసిన అగత్యం వస్తుందని అనుకోలేదు-'

'అదికాదు- అప్పాజీ!-'

'నీ మనసుకు సంకోచాన్నీ భేదాన్నీ కలిగించే విషయాన్ని యింకా తరచడం ఎందుకు నాయనా!- పడినశ్రమకు తగినఫలం దక్కింది- అదే, నీకూ నీ దేశానికి కావలసింది : యీ మూడు రాత్రులూ వసంతోద్యానం మీ విడిది-'— రాయలవారు,- ముసిముసిగా నవ్వారు :-

3

విద్యానగరంలో విడిది విడిదికీ,- తెల్లవార్లూ, శోభ నప్రకళ, పున్నమి వెన్నెలగా వెల్లివిరిసింది. రాయలవారు,- ఎక్కడో మారుమూల మాధవీమంటపంలో, అనురుసురు లతో, - ఆకాశంలో చుక్కలు కన్నులకు అందినన్ని లెక్క పెట్టి, - ఆదమరచి నిద్రపోయినారు :

నగరిలో, పెద్ద ముత్తైదువ తిరుమలాంబ,- నాథుడు సాక్షాత్ కృష్ణావతారమని నమ్మిన ఛాందసాన, పరిపాటి అయిన ఒంటరితనంతో,- నిదురవచ్చేదాకా, ప్రభువు దిగ్విజయవార్తలు చెలికత్తెలు, చిలవలు పలవలల్లి మనవి చేయగా, సెహభాష్ అని తల ఊచుతూనే ఊయెలమీద, కునుకు పట్టించుకుంది.

తొలికోడి కూసింది : రాయలవారు - ఉలికిపడి మేలు కున్నారు. నిదురమబ్బున అడుగు తడబడగా, - మాధవీ మంటపంలో జల్లిబిల్లిగా ఉన్న మల్లెతీగెలు, - రాయల వారిని, అలవోకగా గాఢాలింగనం చేసినవి: కలలంతటా అల్లుకు పోయిన - గజపతుల ఆడుపడుచు కౌగిలింతగా, రాయలవారు తబ్బిబ్బైపోయి, - నిదురమైకాన మనసును ఉద్రూాత లూచి, - తెలివి తెచ్చుకుని, తీగెలమెలి విడిపిం చుకుని,- నికరంగా,- ఇక మేలుకున్నారు.

కపర- కపరగా ఉంది, చీకటి; కన్ను చూచాయగా కనబడుతూంది: మాటుమణగిన నగరం,- ఓ మూలనుంచి మేలుకుంటూంది :

ఎక్కడనుంచో మూలుగు వినబడుతూంది: ఎంతో సేపుగానో, ఆ సవ్వడి, మనసులో రాపాడుతూనే ఉంది, కాని,- పోలికకు రాలేదు:

అడుగులు, అటులాగిసవి: గున్నమావి తిన్నె మీద నుంచి, వస్తూంది ఆ మూలుగు -

—'అప్పాజీ !-'

రాయలవారి గొంతులో, భయం, ఆశ్చర్యం, విషాదం, విభ్రమం -

మహామంత్రి రెండుకళ్ళూ పొడిచేసి-, ఎవరో ఆ తిన్నె మీద పడేశారు: గాటుల్లో చిమ్మిన నెత్తురు, పేరుకుపోయింది: మనిషి, ఒకటే మూలుగుతో, మూటల్లే ఒంటిమీద స్పృహ లేకుండా గుటగుట లాడుతున్నాడు - రాయలవారంత కరుకు యోధుడు- నిర్దాక్షిణ్యంగా అంతసీమను జయించుకువచ్చిన జగజెట్టి - చూసి చూడగానే, పసిపాపడల్లే అడలుతూ, నిలువునా కుప్పకూలి పోయినాడు:

ఒర దూసుకున్న కత్తిలాగా, మనసు, రాత్రి ఏం జరిగి ఉంటుందో ఒక్కసారి ఝళిపించింది-

గజపతుల కన్నె,- ఆమె వెంటవచ్చిన దాసీ రాకాసులు,- మహామంత్రి,- మంచితనానికి చేసిన తంత్రం- పసిపట్టి ఉంటారు: అలా కసితీర్చుకుని ఉంటారు:

తనకైతే, చేతనైనంతవరకూ, రాజ్యాలు జయించడం, పరరాజుల ఢాకను అరికట్టడం, ఇలాంటి, వీరరాహుత మర్యా

దలే తప్ప, మరో పోణిమి, మొదట నుంచీ జబ్బ లేదు: మనసు తోనే వ్యూహాలు పన్ని, ఊహాలతోనే ఆటకట్టించే ఎత్తు దుమికించడం, మహామంత్రుల ప్రజ్ఞ: అదితనకు అర్థంకాదు, చేతకాదు :

మొదటినుంచి కూడా,- గజపతులతో వియ్యం తనకు యిష్టంలేదు; ఆ చిన్నది, తన కుమార్తె ఈడుది: ఎంతజయిం చినా మటుకు, ఏ మొగం పెట్టుకొని తనంత పలకమారిన సంసారి, తగుదునమ్మా అంటూ, పెళ్ళికొడుకౌతాడు? - ఆ చిన్నది ఏమనుకుంటుంది ? కన్నవారూ, విన్నవారూ ఏమను కుంటారు?-

మహామంత్రి దీనికంతటికి ఒక్కటే సమాధానం యిచ్చారు: అంతా విని, ఒక్క చిరునవ్వు నవ్వి,- 'నీకు తెలి యదు నాయనా !- రాజతంత్రంలో,- కయ్యానికేగాదు, వియ్యానికీ అంతకు మించిన ప్రాముఖ్యం ఉంది ! మన సేనలో ఉండి, ఆసీమ ఏలికలను, అనుక్షణం అదుపులో ఉంచనేనా?- కత్తిపదునుకు చేరువగా వాళ్ళకన్నెలను తెచ్చుకుంటే,- ఏనాటికీ మనకు వాళ్లు పాదాక్రాంతులేగా ! - కత్తికి ఒక్కటే పదును; - రాజనీతికి - వేయిపదును లున్నాయి ! - నేను చెప్పినట్టుగా చెయ్యి ! - ' ఇంతా అర్థంఅయ్యేట్టు, రెండు ముక్కలలో చెప్పారు ! తాను, సరేనని, తలవంచుకున్నారు!

కత్తికి బాసికంకట్టి తరలించారు ! - గజపతులు. కన్నె ధారపోశారు : పెళ్ళివారు విద్యానగరానికి తిరిగివచ్చారు.

కొత్త పెళ్ళికూతురికి, ఆమె పరిచారికా గణానికి, అప్పాజీ అతిరహస్యంగా విడిది ఏర్పాటు చేశాడు. అతి వైభవంగా పునస్సంధానానికి సన్నాహం చేశాడు-

అంతవరకూ రాయలవారు, వధువును కళ్ళచూడ లేదు: ఎవరూ, ఆమె అందచందాలను వర్ణించి, నోరూ రించ లేదు: ఆయనకు ఆ విషయంలో అట్టి ధ్యాసకూడా లేదు: అప్పాజీమాటకు ఎదురాడే అలవాటులేక రాజ్య భారంలో బాటే, ఈ బరువూ ఎత్తడానికి మొగ్గాడు: అంతే కాని, అర్ధరివయసులో తనకు యీ పెళ్ళి ఎందుకు, - ఆ చిన్నిది ఎలావుంటే మటుకు తన కెందుకు? ప్రార్థనల్లా ఒకటే! - ఈసారి అయినా ఆంధ్రనాయక స్వామి కరుణించి, మొగపిల్లవాణ్ణి యిస్తే - వంశం నిలుస్తుంది, - తానూ అప్పాజీ యిన్నాళ్లుగా చేసిన నిర్వాహకం నిలుస్తుంది, - తిరుమలాంబిక నీళ్ళాడే ప్రొద్దులు! - ఆ చల్లని కబురు వినేం దుకే, రాయలవారి తహతహ! -

'ఈ రాత్రికే మీకు శోభనం నాయనా!' అంటే సరేనన్నాడు :- 'కాని, ఈ రాత్రి పిల్లదాని కంట నీవు పడ వద్దు!' అన్నా, అదేమని విస్తారానికి చకితుడు కాకుండా సరే నన్నాడు!- కారణం ఏమిటో అప్పాజీ వివరించాడు—— 'గజపతుల గణమంతా జయించి తెచ్చామని, కత్తులు నూరు తున్నది- వాళ్లతో కలసిమెలసి, వైనంతీసిన, పరిచారికలు, ఇది రూఢిచేశారు! చిన్నది, మేలి ముసుగుతోనే ఉంటూంది! అందువల్ల ఆ కవళిక గమనించడానికి ఆస్కారం లేకపోయింది.

అది ఒక్క ప్రతాపం!- ఒంటరిగా పడకటింటిలో తొలిసారి తారసిల్లినప్పుడు, అక్కసుమీద,- ఏ ప్రమాదమన్నా జరగ వచ్చు! అందుకని,- నీకు మారుగా, ముమ్మూర్తులా నీ ప్రతిమను, అక్కడ అమర్చాను! నిలువెల్లా తేనె నింపాను!- నేను మాటున ఉండి, వైఖరి గమనించి, దుడుసుతనం చేసి, ఒరదూసినా, ఏదుటపడి, లొంగదీసి, నీకు అనుకువగా, మనసు కరిగిస్తాను!-'

మహామంత్రి, ఇంత ఎత్తు వేశాడు!- చివరకు ఇలా అయినాడు!-

అప్పాజీ ఇలా బడుగు కావడానికి కారణం- గజపతుల కన్నె!- ఆడుది అని కనికరించ అవసరం లేదు!-

—ఒరలోనుంచి కత్తి దూకింది: రాయలవారు,- అంతకుమించిన ఒరవడితో, ఆ ప్రాసాదంలోకి దూకారు:

౪

సుఖమంటపంలో, ఆ ఒక్కతే అలవోకగా నిలుచుని ఉంది: రాయలవారు హుంకరింపుగా అంతవరకూ సాగారు: ఆ చిన్నది, అడుగు ముందుకు వేసి, అరికట్టింది!- ఓరగా,- 'ఏమా ధూకుడు!' అన్నట్టు. నిదానంగా మందలింపుగా చూసింది!- కన్నడ - రాయలు అరమోడ్పుగా చూపు కుదించుకుని,- కుడ్యభాగాలన్నీ, కొత్తగా చూస్తున్నట్టు చూశాడు: రతీమన్మథులు, ముక్కోటి వైఖరుల మురిసి

పోతున్నారు :- చూడగా చూడగా, కరాన గాద్గదికం,- గళాన కలవరం- రాయలవారు, ఒక్క- నిమేషం, మామూలు మనిషల్లే అయిపోయి,- అంతలో తీవి సంబాళించుకుని,- కత్తి పదునంత కన్ను చేసి,- విసరపోయినారు :

ఎదురు లేకుండా నవ్వింది, ఆ ఒక్క-తే, ఆ వీరుడి ఝళిపింపుకు :

'తండ్రిపరువానికి, తలవంపులు కాదా ఈ ధుడుసుతనం, జయవీరా!-' అని కిలకిల లాడింది : ఒడ్డెపడుచు జాణతనం కన్నడ రాయలకు సోకలేదు : ఆ మాట మెలకువ విప్పి చెప్పేదాకా అర్థంకా లేదు : ఆ చిన్నదాని కంటివంక, చేతి కత్తి పదునువంక చూస్తూ చూపులు సానబెడుతున్నాడు:-

'మీ నాయనగారు, కంటపడ్డ ధాసీపడుచును, ఒంటరిగా చూసి కౌగిలించేవారుకదా !- మీరు కత్తిదూయడం మరియాదా ?- ఎంత అమాయకులండీ!- ఏ అమ్మకన్న బిడ్డలండీ !-'

- ఎంతో అమాయికంగా, సంశయం తీర్చుకునేందుకు అడుగుతున్నట్టు, విన్నపాలాతూంది, ఆ చిన్నది- రాయలవారు ప్రజ్వలించిపోయినాడు-

-అంతఃపుర తోరణానికి, నులిమంచువంటి ఉలిపిరి తెర;- దాని వెనుక మరొకటి. . .

ఏడు తెరల వెనుక మెసలే బంగారుబొమ్మ- ఈ మాటలకు కిలకిల లాడింది!- ఇటు అడ్డం తొలగని చిన్నది:- రాయలవారంత ఉవ్వెత్తునా మౌనంగా నవ్వుతూంది:-

ఒక్క హుంకారముతో, చిన్నది, మల్లెదండల్లే వాలి పోయింది: రాయలవారి, రతనాలు తాపిన బాకు, వేరలన్నీ మూసుకుపోయి, కిలకిలను కూ ర్చేసింది-

కూలిపోయింది - కన్నకూతురు, మోహనాంగి!- పిడిమీదుగా నెత్తురు చిమ్మకుండా గుండెపొదివి పట్టుకుంది, - చావు చాయలకు రాలేని నవ్వు నవ్వింది.

విజయలక్ష్మి నా నెచ్చెలి, ప్రభూ!- మీరు కత్తికి బాసికం కట్టించగానే,- కంఠం నరికేసుకుంది:- గజపతి మీకు దాసుడైనాడు: ఆ యింటి ఆడుపడుచు అవమానం తప్పించుకుంది-'

-రాయలవారు,- రాతిబొమ్మ:

'కత్తికొకనీతి,- గంటానికి ఒకనీతి వుంటుందని ఊహించ లేకపోయినాను: మహా మంత్రులకు హృదయంలేకపోవచ్చు!- మహారాజు- మహాకవి,- బిడ్డలకన్న తండ్రి, తిరుమలాంబికా ప్రాణేశ్వరులు- ఇంతటివారని, ఎన్నడూ కలగనలేదు-'

రాతిబొమ్మ కన్నీరు ద్రిమ్మరిస్తూంది-

కొనఊపిరి, ఇంకా పలుకుతూంది-

'కృష్ణరాయలు ధర్మప్రభువు!- అని, అమాయకులు అనుకుంటున్నారు- హిందువులందరూ కన్నతండ్రిగా భావిస్తు న్నారు- పాపం!-'

—రాయలవారు, కన్నతండ్రిగా - అమ్మా!- అని ఆక్రోశించాడు:-

'మీా మీాద నాకు పగలేదు ప్రభూ :- రాజ్యాకాం క్షకు ఏ యింటి పడుచైనా యిలా బలి కావలసిందే !- గజపతి, - మీా అంత వైభవేపేతుడు కాకపోయినా,- సాటి హిందూప్రభువు !- విజయలక్ష్మి, నావంటి ఆడుపడుచే !- కాని, మహారాజుకు ఎవరు హెచ్చరికలు చేస్తారు ?- మహా మంత్రి ప్రజ్ఞాచక్షులకు ఇలాంటి అల్పవిషయాలు గోచరించవు కదా !- అవును,- అదే రాజనీతి!...అదే సామ్రాజ్యం...'

...బంగారపుబొమ్మ మంచు ముద్దైపోయింది: కన్నడ రాయల మనసు ,- తల్లి లేని పసిపాప అయింది :-

సర్వశూన్యంగావున్న అంతఃపురంలో పిడుగులు ఒర దూసుకున్నట్లు, ఝుళుక్ మని మ్రోగింది,- రాయలగుండెలో శోకం, - ఎక్కడిదక్కడే పేరుకుపోయింది : చిన్నరాణికి పరి వారంగా తరలివచ్చిన, ఒడ్డె కన్నెలందరూ కన్నెత్రాచులల్లే ఒడ్డాణపుకత్తులు దూసి, కమ్ముకున్నారు :

విచ్చుకత్తుల వాడికి, రాయలవారు ప్రమాన్పడలేదు- ఆకన్నెల కన్నుల రంపపుకోతకు విలావిలలైనాడు : ఎన్నడూ వంగని శిరస్సు, నేలకు సోకింది :

—అరవిచ్చిన మల్లెదండల్లే, మోహనాంగిని పుణికి పుచ్చుకుని, ఆ కన్నెలందర్నూ, - ఆవేశంతో దుమికే తరగ లల్లే, - సన్నజాజులనీడలో శాశ్వతంగా జోకొట్టారు : తమ రాజధానికి, కలకాలం జ్ఞాపకంగా, తలవంచుకుని, వెళ్ళి పోయినాడు.

—మోహనాంగిజాడ, నాగవాసంలో ఏనాటికీ తెలియ లేదు: ఆతల్లి ఆరాటానికి, అంతులేదు; పిల్లదాని వైనం తెలియజెప్పడానికీ, ఊరడించడానికీ, మహామంత్రులుకాని, మహారాజుకాని, అంతఃపురం చాయలకు రాలేదు:

—మంచి ప్రొద్దురాకమునుపె తిరుమలాంబిక సీళ్లాడింది: బారెడు పిల్లవాడు:-

వసంతోద్యానంలో, దివ్యభవనం ఒకటి నూతనంగా వెలసింది: అది నివాస నికేతనమో, సమాధో. – కారా గారమో, – ప్రజలకు అర్థంకాలేదు; అడిగి తెలుసుకునే నిబ్బరం ఎవరికీ లేదు.

ఎన్నడన్నా, 'పున్నమి వెన్నెల్లో.– ఆభవనంలో వింత వెలుగులు తోచినట్టు, వేయివన్నెల కిలకిలలు వినిపించినట్లు, ప్రజలు, భయం-భయంగా భ్రమసిపోయేవారు. తెల్లవారిన తరువాత,– అదంతా, ఏదో చీకటి-చీకటిగా,– ఊహకు అందని శాపంగా చూసినవాళ్లకు కనిపించేది. చూడక పోయినా, తలచుకుంటే అలా అనిపించేది.

ఎవ్వరూ అడుగు అటు పడనిచ్చేవారుకాదు: ఒక్క– పెద్దన్నగారు మాత్రం– చుట్టపు చూపుగా కటికిచీకటుల్లో,– అటు పచారుచేస్తూ ఉండేవారు-

కాలం గడవగా– గడవగా,– 'అది చిన్నాదేవి, మేడ!' అంటూ ప్రజలు, రహస్యంగా తలచుకుని, ప్రభువును తలచుకుని, దద్దరిల్లేవారు:

—రాయలరాజ్యం యథా వైభవంగా సాగుతూంది: అష్టదిగ్గజాలకూ పుష్టీ తుష్టీ ఒనగూడుతూనే ఉంది: సప్త సంతానముల సంకల్పానికీ, నిర్వహణానికీ- ఏమీ లోటు లేదు-

కాని,- పెద్దన్నగారు,- మరచిపోడు!...

...'ఆ తల్లి ఆత్మశాంతికి, యింతకాలం బ్రతికాను తిమ్మన్నా !—'

...తిమ్మన్న కంట నీరు వరదలౌతూంది. సభాభవనం నిశ్శబ్దంగా ఎలుగెత్తి రోదిస్తున్నది. చెమ్మగిలో చెదరిన చూపులకు, రాజధాని శిఖరగోపుర ప్రాసాదాలు, శిథిలాలై గోచరిస్తూన్నవి.

సభాభవనంముందు, తిమ్మన్న ఒక్కడూ నిట్టూర్పల్లె నిలచిపోయి ఉన్నాడు...

# ఆ లా ప న

గంగకు అద్దరిగా, రామలింగడు పవళించి ఉన్నాడు: ఇద్దరి, ఒళ్లంతా భయంలోకి కుదించుకుని,– అంతకుముందే నిద్రపోయింది: గది అవతల ఎక్కడో,– రాయలవారి అత్త గారు గుర్రు కొడుతూంది:

వీణ మోగింది: వాణి వెలసింది:

రామలింగడు కన్ను ఎత్తి చూశాడు:

వాణి నవ్వింది:

మెల్లిగా లేచి కూర్చున్నాడు: మళ్ళీ నవ్వింది:

ముక్కుమీద వేలు వేసుకుని, ఆ కిలకిల ఆపాడు: పక్కనున్న పడుచువంక చూసి, – "నీ కేపకాతుంది?"

వాణి, కసురుగా,– "నే నెవరినో తెలుసునా?" అన్నది: